


విద్యుత్ షాక్‌తో గిరిజనుడు మృతి



ప్రజాశక్తి - గూడూరు రూరల్ గూడూరు సమీపంలోని సుందరయ్య కాలనీ ప్రాంతంలో ఉన్న కాలువవద్ద ప్రమాదం చోటుచేసుకుంది. గిరిజన యువకుడు శివ(17) కాలువ దాటుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్తు వైరు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. సుందరయ్య కాలనీ సమీపంలో ఉన్న కాలువవద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ తీగ తెగి పడిపోయింది. సమీపంలో నివాసముంటున్న గిరిజన యువకులు కొందరు కట్టెలు కొట్టుకునేందుకు కాలువ అవతలివైపుకు వెళుతుండగా శివ తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో పడిపోయాడు. మిగతా యువకులు హుటాహుటిన శివను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళారు. ఆ యువకుడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు గ్రామీణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కరెంట్ తీగ తెగిపడినా అప్రమత్తం చేయకుండా, నిర్లక్ష్యం వహించిన విద్యుత్ శాఖపై స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల మృతిచెందిన గిరిజన యువకుని కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు.

తుపానులో నష్టపోయిన... అందరినీ ఆదుకుంటాం..!

వారం రోజుల్లో న్యాయం చేస్తామని సిఎం హామీ
బాల్రెడ్డిపాలెం -గంగనపాలెం వంతెనకు నిధులు
60వేల మందికి రూ.2,500 చొప్పున పరిహారం


ప్రజాశక్తి - కోట, వాకాడు

మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ సకాలంలో ఆదుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వారం రోజుల్లో అందరికీ న్యాయం చేస్తామన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోట మండలం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. అక్కడనుంచి కోటక్రాస్‌రోడ్డు మీదుగా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెంలో వరద ముంపుకు గురైన ప్రాంతానికి చేరుకున్నారు. తుపాను బాధిత గ్రామస్తులు, రైతులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. బాల్రెడ్డిపాలెం గంగనపాలెం మధ్య ఉన్న వంతెన నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తామనాన్రు. జిల్లాలోని 60వేల మందికి రూ.2,500 చొప్పున నష్టపరిహారం, బియ్యం, పప్పు, ఆయిల్ కిట్లు అందుతాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామన్నారు. వర్షం వల్ల రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ప్రతి ఇంటికీ వాలంటీర్ వచ్చి రూ.2,500 ఇస్తారన్నారు. నష్టపోయిన రైతుకు 80శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తామన్నారు. యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నామన్నారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందన్నారు. పర్యటన అనంతరం సిఎం కాన్వాయ్ ద్వారా తిరిగి విద్యానగర్‌కు చేరుకుని హెలిప్యాడ్ సమీపంలో కోట మండలంలోని ముఖ్య నాయకులు కొడవలూరు ధనంజయరెడ్డి, చేవూరి నాగేశ్వరరావు, నేదురుమల్లి హరిచంద్రరెడ్డి, కోట ఎంపిపి దాసరి అంజమ్మ, జడ్‌పిటిసి దాసరి కోటయ్యలను మండలంలో తుపాను నష్టం వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 1.25 గంటలకు కోట మండలం నుంచి బాపట్లకు బయల్దేరి వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ఉన్నారు. సిఎంకు వీడ్కోలు పలికిన వారిలో తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు కె.వెంకటరమణారెడ్డి, ఎం.హరినారాయణ, జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, తిరుపతి ఎంపి ఎం.గురుమూర్తి, నెల్లూరు జిల్లా జడ్‌పి ఛైర్‌పర్సన్ అరుణమ్మ, ఎంఎల్‌సిలు మేరిగ మురళి, కల్యాణచక్రవర్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు ఎంఎల్‌ఎలు ఆదిమూలం, వరప్రసాద్, సంజీవయ్య, విక్రమ్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గం వైఎస్‌ఆర్ సిపి ఇన్‌ఛార్జి రాంకుమార్‌రెడ్డి, గూడూరు నాయకులు పొనక దేవసేనమ్మ ఉన్నారు.



పంట నష్టం వివరాలను సిఎంకు వివరిస్తున్న గూడూరు ఆర్డీవో

అన్నీ కాకమ్మ లెక్కలే..! న(క)ష్టం చూడరు..!





తుపాను బాధితుల్లో నైరాశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మిచౌంగ్ తుపాను రూపంలో ప్రకృతి కర్షకులను, సామాన్య ప్రజలను కోలుకోలేని దెబ్బతీసింది. మూడు రోజులపాటు పాటు కురిసిన ఈదుర గాలులతో కూడిన భారీ వర్షాలకు తూర్పు మండలాల్లో భారీగానే ఆస్తి నష్టం, పంటనష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల ప్రాణ నష్టమూ చోటు చేసుకుంది. ముఖ్యంగా అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికందకుండా పోయాయి. వ్యవసాయ పంటలు, ఉద్యాన తోటలు కలిపి సుమారు 5 వేల హెక్టార్లకు పైగా దెబ్బతిన్నాయని సమాచారం. అదే విధంగా వందల సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వరద ధాటికి పంట పొలాలు కోతకు గురై సారవంతమైన భూమి కొట్టుకుపోయింది. నష్టం అంచనా కోట్లలోనే ఉంటుంది. అయితే తుపాను వెలసి నాలుగు రోజులు దాటిపోతున్నా సంబంధిత అధికారులు తుపాను ప్రభావంతో ఏర్పడ్డ పూర్తి నష్టాన్ని అంచనా వేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కాకమ్మ కబుర్లతో కాలయాపన చేస్తున్నారన్న అపవాదు ఉంది. దెబ్బతిన్న పంటల్ని, పంట పొలాలను, ఇళ్లను అధికారులు ఎప్పుడు చూస్తారు..? చూస్తే నష్టపరిహారం వస్తుందా..? లేదా అనే ఆందోళన ఇప్పుడు రైతులతో పాటు సామాన్య ప్రజల్లో నెలకొంది. తుపాను బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామంటూ ప్రభుత్వం మాటలు చెబుతున్నప్పటికీ, ఆ దిశగా ఆచరణ లేకపోయింది. అధికార యంత్రాంగం కూడా ఇప్పటి వరకు క్షేత్రస్థాయి పంట నష్టం, ఆస్తి నష్టంపై లెక్కలు వేసింది లేదు. గడిచిన రెండు రోజుల నుంచి ఎండ కాస్తుండటంతో రైతులు పొలాల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టారు. నిల్వ ఉన్న నీటిని బయటికి తరలించుకోవడం, నేలకొరిగిన మొక్కలను కూలీల సాయంతో తిరిగి నిలబెట్టే ప్రయత్నం చేసుకుంటున్నారు. జరిగిన నష్టం కంటికి కనిపించాలంటే ఇప్పటికే రైత్వారీ అంచనాలు చేపట్టాల్సి ఉంది. మరో రెండు రోజులు గడిస్తే అధికారుల కళ్లకు కనిపించదు. అప్పుడు ఏదో ఒక లెక్క రాసి మసి పూసి మారేడు కాయ చేసేస్తారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టం 2 వేల హెక్టార్లేనట..!!

మిచౌంగ్ తుపాను ప్రభావం తూర్పు మండలాలపై పెద్ద ఎత్తునే ప్రభావం చూపింది. ఒక్క తొట్టంబేడు మండలంలోనే వెయ్యి ఎకరాలకు పైగానే వరి పంటలు దెబ్బతిన్నట్లు అంచనా. అయితే శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, కేవీబీ పురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలను కలుపుకొని కేవలం 2 వేల 241 హెక్టార్లలోనే పంట నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాకు రావడం గమనార్హం. వీటిల్లో వివిధ దశల్లో ఉన్న వరి పంటలు, వేరుశనగ, మినుము పంటలు మాత్రమే ఉన్నాయి. 608 ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయనీ, 143 ఎకరాల్లో భూమి కోతకు గురి అయినట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. అయితే తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం బోనుపల్లి, పెద్ద కనపర్తి గ్రామాల్లోనే 200 ఎకరాల్లో ఇసుకమేటలు, 100 ఎకరాల్లో పంట పొలాలు కోతకు గురైనట్లు బాధిత రైతులు వాపోతున్నారు. వరద ధాటికి పంటలు, పంట పొలాలు దెబ్బ తినడంతో పాటు విలువైన మైక్రో ఇరిగేషన్ పైపులు కొట్టుకొని పోయాయని రైతులు చెబుతున్నారు. మరి వ్యవసాయ అధికారులు ఇచ్చిన ప్రాథమిక నివేదికలో ఈ లెక్కలు ఉండకపోవడం శోచనీయం. ఇక ఆస్తి నష్టం విషయానికొస్తే సంబంధిత అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే దాఖలాలు లేవు. తుపాను ప్రభావంతో నిరాశ్రయులైన వారికి కంటితుడుపు చర్యగా ఆహార పొట్లాలు అందజేశారే తప్పా, వారికి జరిగిన ఆస్తి నష్టం పై ప్రభుత్వానికి నివేదికలు పంపడంలో నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర వీడి, పూర్తిస్థాయిలో తుపాను నష్టాన్ని అంచనావేసి బాధితులకు సత్వర సాయం అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ. లక్ష నష్టం: గంగయ్య, రైతు, బోనుపల్లి



తుపాను కారణంగా ఎకరా పొలం కోతకు గురైంది. సారవంతమైన మట్టి కొట్టుకుపోయి రాళ్లు, నీళ్లు చేరాయి. డ్రిప్ పైపులు, సామగ్రి కూడా వరదపాలైంది. నష్టం రూ. లక్ష పైమాటే. పొలాన్ని తిరిగి సాగులోకి తెచ్చేందుందుకు ప్రభుత్వం సాయమందించాలి.

రెండెకరాల్లో ఇసుక మేటలు: రవి, రైతు, బోనుపల్లి



తుపానులో వచ్చిన వరదల కారణంగా నా రెండెకరాల పొలంలో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. భూమి కోతకు గురైంది. డ్రిప్, సామగ్రి కొట్టుకుపోయింది. రూ.2 లక్షలు విలువజేసే డ్రిప్ వ్యవస్థను 90 శాతం రాయితీపై పెట్టించుకున్నా. ప్రభుత్వం ఆదుకోవాలి.

'అమరా'లో 'హిప్' అంతర్జాతీయ సమావేశం

ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరనేని


ప్రజాశక్తి - రేణిగుంట

అమర ఆసుపత్రిలో మోకాలు తుంటి ఎముకలకు (హిప్) అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని స్పష్టం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కరకంబాడి సమీపంలో గల అమర పారిశ్రామిక కర్మాగారం ఆడిటోరియం నందు మోకాలు తుంటి ఎముకలకు (హిప్) శస్త్ర చికిత్సల అంతర్జాతీయ సమావేశం అమర హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని ఆధ్వర్యంలో జరిగింది. భారతదేశం నుండే కాకుండా అమెరికా ఇతర దేశాల నుండి ప్రముఖ ఎముకల కీళ్ల వ్యాధి డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ గౌరినేని మీడియాతో మాట్లాడుతూ హిప్ పై ఇప్పటికే రెండు శిక్షణ శిబిరాలు నిర్వహించామని, ప్రస్తుతం మూడవ శిక్షణ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హిప్ పై మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మోకాలు తుంటి ఎముకకు బటన్ హోల్ ద్వారా చికిత్స చేసే విధానం గురించి తెలియజేశారు. అమెరికాలో హిప్ పై తనకున్న ప్రావీణ్యంను భారతదేశంలోని డాక్టర్లకు శిక్షణ ఇవ్వాలని ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మిగతా రెండు మూడు రోజుల్లో తుంటి ఎముకలకు కోతలు ద్వారా శస్త్ర చికిత్సలు చేసే విధానంను తెలియజేస్తామన్నారు. రాబోవు రోజుల్లో అమర ఫౌండేషన్ ను బలోపేతం చేసి మరెంతో మంది పేద ప్రజలకు చికిత్సలు అందుబాటులోకి తీసుకొస్తామనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ డాక్టర్లు డాక్టర్ లీ విట్ కెన్, డాక్టర్ ఎన్జీయున్ సూన్ ట్రొంగ్ భారతదేశ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జగదీష్, అమర హాస్పిటల్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, ఏజీఎం శ్రీధర్, అమర హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ నరసింహ రావు, అమర హాస్పిటల్ పిఆర్‌ఓ మునినాదం పాల్గొన్నారు.



ఎస్వీబీసీ ఉద్యోగులకూ 62 ఏళ్లకు పెంచాలి: సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



ఎస్వీబీసీ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో టిటిడి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. రానున్న పాలక మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి వయోపరిమితిని పెంచాలని పాలకమండలి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఇఓ ధర్మారెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు, టీటీడీ శాశ్వత ఉద్యోగులకు 62 ఏళ్ల వయోపరిమితిని పెంచిన నేపథ్యంలో ఎస్వీబీసీ లోని ఉద్యోగులకు, టిటిడి అన్ని విభాగాల్లో వివిధ పేర్లతో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికులకు రిటైర్మెంట్ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని సూచించారు.

13న ఫార్మసీ డిప్లొమా కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్

ఎన్‌బిఎ గుర్తింపుగల టీటీడీకి చెందిన శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి 13వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణత పొందిన ఆసక్తి గల విద్యార్థినులు విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్, 3 సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారు. సీట్లు పరిమితంగా ఉన్నాయి. మరిన్ని వివరాల కోసం 9299008151, 9247575386, 8978993810 నంబర్లను సంప్రదించగలరు.

అద్దె కట్టని దుకాణాలకు తాళాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



అద్దె చెల్లించని పలు మున్సిపల్ దుకాణాలకు అధికారులు శుక్రవారం తాళాలు వేశారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అధిక మొత్తంలో బకాయిలు ఉన్న దుకాణాల వద్దకు అధికారులు వెళ్లారు. బకాయిలు చెల్లించాలని ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో రమేష్ బాబు ఆదేశాల మేరకు ఆఖరకు తాళాలు వేశారు. సకాలంలో ఎవరు బకాయిలు చెల్లించకున్నా మూసివేత తప్పదని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మున్సిపల్ బకాయిలు చెల్లిస్తూ పురపాలక సంఘం అభివద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బి. బాలచంద్రయ్య, పి. రవికాంత్ పాల్గొన్నారు.

కాళంగి ఉగ్రరూపం
ఇసుక మేట..రైతన్న గుండెకోత..

• తుపానొచ్చిన ప్రతిసారీ ఇంతే • శాశ్వత పరిష్కారం లేదా..?

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

కాళంగి నది ఉగ్రరూపం దాదాపు వంద ఎకరాల్లో అన్నదాతకు గుండెకోత మిగుల్చుతోంది...తుపాను వచ్చిన ప్రతిసారీ పొలాలన్నీ ముంపుకు గురవడం, బెత్తెడు మందాన ఇసుక మేట వేయడం, దీన్ని సరిజేసుకోడానికి నాలుగైదు లక్షలు ఖర్చవడం షరా మామూలయ్యింది.. శాశ్వత పరిష్కారం చూపాలంటూ అన్నదాతలు ఈసారి పట్టుబడుతున్నారు. ప్రతి ఏటా ఇసుక మేటలతో సేద్యం చేయలేమని వాపోతున్నారు.


బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల పంచాయతీ రెవెన్యూకు చెందిన పేద రైతుల పొలాలు కాళంగి నది పరీవాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. ఈసారి తుపాను సృష్టించిన బీభత్సానికి దాదాపు వంద ఎకరాలలో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. పంట పొలాలు ఎడారులను తలపిస్తున్నాయి. తుపాను శాంతించి నాలుగు రోజులైనా ఆ ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితని రైతులు వాపోతున్నారు. కాళంగి నది పొంగిపొర్లడంతో వేల లక్షల టన్నుల ఇసుక గులకరాళ్లు పొలాల వైపు దూసుకొచ్చి పంట పొలాలు మాయమై ఎడారిగా మారింది.

1970లో అప్పటి ప్రభుత్వం రైతు కూలీలకు పల్లమాల రెవెన్యూలో 220 ఎకరాలు సొసైటీ భూమిని సాగు చేసుకోమని ఇచ్చింది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఏదో ఒక విపత్తుకు గురవుతూ నష్టపోతూ ఆర్థికంగా చితికిపోతూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అర్ధ శతాబ్దంగా శాశ్వత పరిష్కారం కావాలని పాలకులను, అధికారులను అడుగుతూనే ఉన్నారు. కానీ ఏ ప్రభుత్వమూ వీరి గోడు వినలేదు.

కల్వర్టు నిర్మించాలి : గోపాల్‌రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి

కాళంగి నది పరీవాహక ప్రాంతంగా 220 ఎకరాల సొసైటీ భూమి ఉంది. ఈ ప్రాంతంలో ఒక కల్వర్టు నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. దీనికి అయ్యే ఖర్చు 50 లక్షలు మాత్రమే. అయితే ప్రతి ఏటా రైతులు నష్టపోతున్నది దీనికి మించి ఉంటుంది.





నదీ ప్రవాహానికి కొట్టుకుపోయిన పొలాలు

ప్రభుత్వం ఇచ్చే పరిహారం పంట నష్టానికి మాత్రమే ఉంటుంది. ఇది పంట నష్టమే కాదు, పొలాల్లో ఇసుక మేట వేసి, తిరిగి పంటకు అనువుగా మార్చుకోవాలంటే లక్షల్లో ఖర్చు అవుతుంది. ఇలాంటి ఘటనలే రైతన్న ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. అధికారులు గుర్తించి వీరి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

రైతన్నలు క'న్నీటి'పర్యంతం

మామిడి కాల్వకు గండి 500 ఎకరాలు వర్షతర్పణం



తుపానుకు నేలవాలిన పంటలు

ప్రజాశక్తి - ఓజిలి

మిచౌంగ్ తుఫాన్ రైతులను నిండుగా ముంచేసింది. రైతు కంట కన్నీటి ధారను మిగిల్చింది. బలమైన గాలులతో విరుచుకుపడ్డ మిచౌంగ్ తుఫాన్ విధ్వంసం సష్టించింది. తుఫాను కారణంగా కళ్ళ ఎదుటే పంట వర్షతర్పణం అవడంతో రైతుల ఆవేదన వర్ణించలేనిది. ఈసారైనా అధిక దిగుబడులు వస్తాయని ఎంతగానో ఆశించిన రైతుకి నిరాశ ఎదురైంది. ఓజిలి మండల పరిధిలోని ఒక్క కురుగొండ గ్రామంలోనే సుమారు 500 ఎకరాల వరకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికంగా ప్రవహిస్తున్న మామిడి కాలువకు గండిపడి సుమారు 500 ఎకరాల వరకు మిరప,వరి ,సవక పంటలు నది ప్రవాహానికి కొన్ని ఎకరాలు నీట మునగక, మరికొన్ని ఎకరాలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఇనుగుంట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న 7 ఎకరాల బొప్పాయి తోట మట్టిపాలయ్యింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వరి నాట్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వందలాది ఎకరాల్లో నర్సరీ నీటి పాలయ్యింది. వేలాది రూపాయలతో వేలాది ఎకరాల్లో సాగు కోసం సిద్ధం చేసుకున్న భూములు తుపాను తాకిడికి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వరి నాట్లు వేసిన రైతులు ఒక్కొక్క ఎకరాకు సుమారుగా 20 నుంచి 30 వేల రూపాయలు వరకు పెట్టుబడి పెట్టిన రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వర్షాల కోసం ఎదురుచూసిన రైతులు ఒక్కసారిగా మిచౌంగ్ తుఫాన్ అల్లకల్లోలంగా విరుచుకుపడ్డాది తుఫాను కారణంగా అధిక వర్షపాతం నమోదవ్వడంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతన్నలు అధికారులను వేడుకుంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వివిధ పంటలపై అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

రూ.50 లక్షల భూమి హాంఫట్

ప్రజాశక్తి -సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం దాసుకుప్పం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ కరువయ్యింది. ఇప్పటికే ఈ పంచాయతీ సంబంధించిన విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్టు ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో భూబకాసురులు ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడంలో వెనుకాడడం లేదు. కొంత పట్టా భూములు ఉంటే చాలు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అందులో పాగావేయడం షరా మామూలుగా మారిపోయింది. ఇందుకు చెన్నేరి, పుదుకుప్పం సరిహద్దులో ఆక్రముణకు గురి అవుతున్న విలువైన ప్రభుత్వ భూములే నిదర్శనంగా నిలుస్తోంది. సత్యవేడు నుంచి ఊతుకోట ప్రధాన మార్గంలో ఓ ప్రైవేట్ ఫామ్ హౌస్కు సమీపంలో సత్యవేడు పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడికి సంబంధించి కొంత స్థలం ఉంది. మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ స్థలంలో ప్రస్తుతం తారు మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు స్వంతంగా చేసుకుంటున్నారా? లీజుకు ఏమైనా ఇచ్చారా అన్నది తెలియాల్సి ఉంది. అయితే ఈ స్థలానికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని కంచె నిర్మాణం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. సర్వే నెంబరు 224/1 సిలో దాదాపు 80 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని కంచెను నిర్మించేశారు.ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి దాదాపు 50 లక్షల రూపాయలు విలువ చేస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. పైగా ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకొని ప్రభుత్వ భూమి ఉండడంవల్ల దీని విలువ కూడా భారీ స్థాయిలో ఉంటుంది. అయితే మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు ముసుగులో యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని స్వంత స్థలంలో కలిపేసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని దర్జాగా కంచెను నిర్మించినా సంబంధిత రెవెన్యూ అధికారులు చోద్యం చూడడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా పంచాయతీ అధికారులు సైతం ప్రేక్షక పాత్ర వహించడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత సత్యవేడు రెవెన్యూ అధికారులు దీనిపై స్పందించి సత్యవేడు టు ఊతుకోట ప్రధాన రోడ్డు మార్గంలో చెన్నేరి సరిహద్దు వద్ద ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడడానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు కంచెను తొలగించి ప్రభుత్వ భూమికి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

'చెన్నేరి' ప్రభుత్వ భూములకు రక్షణ కరువు



కబ్జాకు గురైన ప్రాంతంలో వేసిన ఫెన్సింగ్

హైలెవల్ బ్రిడ్జి నిర్మించండి : సిపిఎం

ప్రజాశక్తి - కెవిబిపురం

రాజుల కండ్రిగ నుండి ఎగువపూడి గ్రామాలకు వెళ్లే కాలంగి నదిపై శాశ్వత ప్రాతిపదికన హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్, కె వి బి పురం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, ఎగువపూడి శాఖ కార్యదర్శి శంకరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఎగువపూడి, పోలినాయుడు కండ్రిక, పూడి సి.కే.పురం, వఢి పాలెం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున రాజుల కండ్రిగ సమీపాన గల కాలంగి నది వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాలు వచ్చినప్పుడు అంతా కాంట్రాక్టర్ల లాభాల కొరకు తాత్కాలికంగా మట్టి పోసి మళ్లీ వర్షాలు వచ్చిన తర్వాత పోసిన మట్టి వరదలకు కొట్టుకపోతే మళ్లీ కాంట్రాక్టర్లకు లక్షల రూపాయలు వెచ్చించి మట్టి పోసే పరిస్థితి ప్రతి సంవత్సరం కొనసాగుతున్నదని, వర్షాకాలం వస్తే తమ బాధలు వర్ణనాతీతమని, వర్షాకాలం మొదలైతే గర్భిణీ స్త్రీలు, వద్దులు ఎవరికైనా ఆరోగ్యం పాడైతే ఎటు పోలేక ప్రాణాలు కోల్పోతున్నామని, ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దష్టికి, ప్రజా ప్రతినిధుల దష్టికి తీసుకెళ్లినా హామీలు ఇస్తారు తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వతంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించి, నాలుగు గ్రామాల ప్రజలకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.





తుపాను బాధితులను ఆదుకోండి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

వర్షాలు తగ్గి మూడు రోజులు అవుతున్నా గూడూరు శ్రామిక్ నగర్‌లో సమస్యల పరిష్కారానికి అధికారులు గాని, నాయకులు గాని ఎవరూ స్పందించక పోవడం శోచనీయమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వెల్లడించారు. భారీ వర్షాలతో గూడూరు పట్టణంలో దెబ్బతిన్న శ్రామిక్ నగర్ లో చింతా మోహన్ పర్యటించారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ కన్వీనర్‌గా ఐరాల లోకేష్ రెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న ఐరాల లోకేష్‌రెడ్డి

ప్రజాశక్తి రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ ఆమ్ ఆద్మీ కన్వీనర్ గా ఐరాల లోకేష్ రెడ్డి ని నియమించినట్లు జిల్లా ఆమ్ ఆద్మీ కన్వీనర్ నీరుగట్టు నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటా చలపతి నియామక పత్రాన్ని శుక్రవారం అంద జేసినట్లు ఆయన తెలిపారు. ఐరాల లోకేష్ రెడ్డి గతంలో వైయస్సార్ ఆర్మీ విభాగం అధ్యక్షుడిగా కష్టపడి పనిచేసి ఆ పార్టీ అభివృద్ధికి సేవ చేసి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎంతో కృషి చేశానని, ఆ పార్టీలో కష్టపడిన వ్యక్తులకు గుర్తింపు లేకపోవడం, వైసిపి ప్రజా ప్రతినిధుల అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలను భరించలేక వైసిపికి రాజీనామా చేసి నీతి, నిజాయతీకి మారుపేరైన ఆమ్ ఆద్మీలో చేరినట్లు లోకేష్ రెడ్డి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీ అభివృద్ధికి, నియో జకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటా చలపతి, రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): స్వార్ధ రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశ ప్రయోజనాలే పరమావధిగా ఆమ్ ఆద్మీ పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటా చలపతి మాట్లాడుతూ స్వార్ధ రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశ ప్రయోజనాలే పరమావధిగా ఆమ్ ఆద్మీ పనిచేస్తుందన్నారు. చంద్రగిరి కన్వీనర్ లోకేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యేతో 12 ఏళ్ల కలిసి నడిచానని, కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా ఆప్‌లో చేరానన్నారు. ఆప్ సీనియర్ నాయకుడు లోకేష్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆప్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా 125 అసెంబ్లీ సెగ్మెంట్లలో పోటీ చేయనున్నామన్నారు. పార్టీలో రాష్ట్ర కార్యదర్శిగా బాలసుబ్రమణ్యం, తిరుపతి కన్వీనర్ గా రాజేష్ రాయల్, పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యులుగా నందినికి చోటు దక్కిందన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-నాయుడుపేట: మండలంలోని సీతా రామా పురం, కుంటికాలనీ లోని 52 గిరిజన కుటుంబాలకు వైసిపి మండల కన్వీనర్ తమ్మిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి జెసిఎస్ కన్వీనర్ యాదవ్, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, సర్పంచ్ సిద్దారెడ్డి రాజేశ్వరమ్మ సచివాలయ కన్వీనర్ అధికారులు శ్రీనివాసులు, వైఎస్సార్ సీనియర్ నాయకులతో కలిసి శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజీవయ్య నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తూ మిచౌంగ్ తుపాను కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తెలుసుకొని అప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. గతంలో కరోనా సమయంలో ప్రజలను ఆదుకొని సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంజీవయ్య మాటల మనిషి కాదని, చేతల మనిషి అని మరోసారి నిరూపించారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకట్రావు, వీఆర్వో హరిబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందిస్తున్న వైసిపి నాయకులు

అర్థశాస్త్ర అధ్యాపకునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కెఆర్ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు బి పీర కుమార్ కి విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రకటించడం పట్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీర కుమార్ కృషిని, ఆతని పరిశోధనల గురించి పేర్కొన్నారు. 'ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రధాన పంటలు అనే అంశం లో చేసిన పరిశోధనకు డాక్టరేట్ రావడం కళాశాలకు ఎంతో గర్వ కారణ మని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, అధ్యాప కులు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ కె కోటేశ్వరరావు, డాక్టర్ గోవిందు , సురేంద్ర, ఎస్ శ్రీధర్ శర్మ, కిరణ్మయి, కృష్ణమూర్తి గ్రంథాలయ అధ్యాపకులు డాక్టర్ పి విజయ మహేష్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకున్న అధ్యాపకుడిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

సత్వర న్యాయం లోక్ అదాలత్ ధ్యేయం: సివిల్ జడ్జి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని, రాజీ మార్గమే రాచ మార్గమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్ సి రాఘవేంద్ర పేర్కొన్నారు. పుత్తూరు కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాల్ నిర్వహిస్తామని అందుకోసం లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశామని, ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసు కోవాలని, న్యాయవాదులు, పోలీసులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. క్రిమినల్ కేసులకు, అన్నిరకాల సివిల్ కేసులను, వివాహ సంబంధ మనోవర్తి కేసులను, చెక్కు బౌన్స్ కేసులకు పరిష్కారం మార్గం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి రాఘవేంద్ర , ప్రధాన జూనియర్ (జానకి, అధనపు (జూనియర్ సివిల్ జడ్జి గోపాల్ పాల్గొంటారని తెలిపారు.


సేవతో గెలవాలి..బోగస్ ఓట్లతో కాదు: టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో గాని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గాని ఎక్కడా జరగని విధంగా ఒక్క చంద్రగిరి నియోజకవర్గం లోనే దొంగ ఓట్లను చేరుస్తున్నారని, గెలవాలంటే ప్రజలకు సేవ చేసి గెలవాలి కాని బోగస్ ఓట్లతో కాదని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హితవు పలికారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాని మాట్లాడుతూ కొందరు అధికారులు అధికార పార్టీ ఎమ్మెల్యేకు దాసోహం అన్నట్లుగా వ్యవహరిస్తూ దొంగ ఓట్లను చేర్చడంలో సహాయ సహకారాలు అందిస్తున్నారని, టిడిపి అధికారంలోకి రాగానే ఎవరైతే అధికారులు ఇలాంటి పనులకు ఉపక్రమించారో వారిపై విచారణ కమిటీ వేయించి న్యాయ పరంగా తగిన శిక్షలు పడేలా చేస్తానన్నారు. గత మూడు నెలలుగా చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి దొంగ ఓట్లను గుర్తించి తగిన ఆధారాలతో కలెక్టర్ కు, ఈఆర్‌ఓకు అందించినా ఇప్పటివరకు దొంగ ఓట్లను తొలగించకపోవడం ప్రజాస్వామ్యం పట్ల అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ కు 100 నుంచి 200 దొంగ ఓట్లు ఎక్కించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఫామ్ 6 నమోదు చేస్తున్నారన్నారు. రానున్న నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో దొంగ ఓట్లను తొలగించాలని లేని పక్షంలో ఈఆర్‌ఓ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి, జనార్దన్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, నరసింహారెడ్డి, మధు, గౌస్ బాష, జనార్ధన్ పాల్గొన్నారు.

రాము మృతి తీరని లోటు

- బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ తెలుగు మహిళ శ్రీలక్ష్మి భర్త, టీడీపీ సీనియర్ నేత రాము మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీలక్ష్మి భర్త రాము శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శ్రీలక్ష్మి కుటుంబానికి టీడీపీ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు ఆయన సతీమణి రిషితా రెడ్డి, తల్లి బొజ్జల బృందమ్మ శ్రీలక్ష్మి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. రాము మృతదేహానికి చక్రాల ఉష, గంగినేని చెంచమనాయుడు, గాలి మురళి నాయుడు నివాళులర్పించారు.

పది మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్



టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడిన ఎర్రచందనం స్మగ్లర్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని బడా స్మగ్లర్లకు చేరవేస్తున్న పది మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఎస్‌పి చక్రవర్తి తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని కపిల తీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన ప్రధాన సూత్రధారి బాబు ఎర్రచందనం అక్రమ రవాణా కోసం మేస్త్రీలతో మాట్లాడుకుని కూలీలను, వాహనాలను సమకూర్చుకొని శేషాచలం అడవుల నుండి అక్రమంగా దాటిస్తున్నారన్నారు. టాస్క్ ఫోర్స్ యథావిధులలో భాగంగా డీఎస్పీలు చెంచుబాబు, మురళీధర్, పర్యవేక్షణలో సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలోని ఆర్ఎస్ఐలు విష్ణువర్ధన్ కుమార్, సురేష్ బాబు, విశ్వనాథ్, వినోద్ కుమార్ టాస్క్ ఫోర్స్ విధుల్లో భాగంగా భాకరాపేట, ఎర్రావారి పాలెం సమీపంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పరిశీలిస్తుండగా బాకరాపేట రేంజ్ పరిధిలోని ముష్టికాయల పంట గ్రామానికి సమీపంలో కొంతమంది వాహనంలో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించా రన్నా రు. వెంటనే వారిని చుట్టు ముట్టి బాబు, కన్న దాసన్ కాళీ, కమల కన్నన్ కాళీ, జ్ఞాన శేఖరన్, అజిత్, రామకృష్ణన్ రామన్, కాళి పేచి నడుకాలి, విజయ్ కుమార్, జయప్రకాష్, ప్రకాశం గోవిందన్ లను అరెస్టు చేశామన్నారు. అరెస్టు అయిన వారిలో ప్రధాన సూత్రధారి బాబుపై ఇప్పటికే మూడు జిల్లాల పరిధిలో 13 కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసుకు సంబంధించి మరి కొంత మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తామన్నారు. వీరి నుంచి 306 కేజీల పది ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎలాంటి తప్పిదాలూ లేకుండా నిర్వహించాలి

ఓటర్ల జాబితా జిల్లా పరిశీలకులు పోలా భాస్కర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదం లేకుండా సక్రమంగా నిర్వహించాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల ఓటర్ల జాబితా పరిశీలకులు పోలా భాస్కర్ పేర్కొన్నారు. రూరల్ మండలంలోని తడుకు పంచాయతీ వేణుగోపాలపురం గ్రామంలో 32, 33, బూత్ పరిధిలోని బిఎల్‌వోలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామాల్లో చనిపోయిన ఓటర్లు ఉంటే వెంటనే తొలగించాలని మార్పులు చేర్పులు ఉంటే వాటిని కొత్త ఓట్లను నమోదు చేయించాలన్నారు. బయట గ్రామాలలో ఉంటే అలాంటి ఓటర్లను వారు ఉన్న చోటే ఉండేలా చూడాలని, రెండు మూడు ఓట్లు ఉన్నా వాటిని పరిశీలించి ఒకే చోట ఏర్పాటు చేసి మిగిలిన చోట్ల తొలగిం చాలన్నారు. కులమత భేదాలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్‌డివో సుజన, పుత్తూరు తహశీల్దార్ పరమేశ్వర స్వామి, డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేవీఎం రెడ్డి. ఏఎస్ఓ ముని కృష్ణయ్య, తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్‌వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఓటర్ల జాబితా ఓటర్లను పరిశీలిస్తున్న అధికారి పోలా భాస్కర్

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి: సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు తులసీరామ్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసి డిపోను ఆయన శుక్రవారం సందర్శించి కార్మికులను కలసి వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం గూడూరు పట్టణ సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి కార్మికుల సమస్యలపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. గూడూరు డిపోలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈయన వెంట సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్ , తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు తులసీరాం

ఆచార్య వీణానోబుల్ దాస్ గొప్ప దార్శనికులు

పలువురి ప్రశంస



ప్రజాశక్తి - క్యాంపస్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆచార్య వీణానోబుల్ దాస్ గొప్ప దార్శనికురాలని వక్తలు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో విశ్రాంత ఆచార్యులు, విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వీణానోబుల్ దాస్ ఆరవ ఎండోమెంట్ లెక్చర్ ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగుళూరు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ చిత్రా పణికర్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో, సాహిత్యం, సంస్కృతి అంటే ఏమిటి అనే ప్రాథమిక భావనలను స్పృశిస్తూ, ఆ కాలంలో క్లాసికల్ ప్రజాదరణ పొందిన వాజ్ఞానికి విశ్లేషించినట్లు ఉపన్యాసం ఆద్యంతం ఉపయుక్తంగా సాగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ ప్రొఫెసర్ వీణా నోబుల్ దాస్ దార్శనికురాలని, ఆవిడ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రొఫెసర్. వై. ఎస్. శారద, ప్రొఫెసర్ వీణా నోబుల్ దాస్ ఒక విద్యావేత్తగా, అడ్మినిస్ట్రేటర్ గా విభాగానికి విశ్వవిద్యాలయానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.భారతి, ప్రొఫెసర్ పి.హరి పద్మారాణి, ప్రొఫెసర్ ఎం. నీరజ, ప్రొఫెసర్ మధు జ్యోతి, డాక్టర్ యువశ్రీ, ప్రొఫెసర్ కె.సుమ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంబిఎంలో ఎడ్జ్ ఇంటర్నేషనల్ బి-స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : 2022-23 విద్యా సంవత్సరానికి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ కోర్సు 2వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బంగారుపాళ్యంలోని ఎడ్జ్ ఇంటర్నేషనల్ బీ-స్కూలు విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల డైరెక్టర్ జి.భాస్కర్ రెడ్డి తెలిపారు. వీరిలో జీఆర్.కీర్తి, ఎం.జ్యోష్న, ఎస్ విజ్ఞత, ఎం వరలక్ష్మి, జి యుగంధర్ రెడ్డి ఉత్తమ ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలతో మెరిశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ జి.భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై సతీష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రేపు గౌడల కార్తీక వనభోజన మహోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా గౌడ సంఘం, ఆంధ్రప్రదేశ్ గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పదో తేదీన చంద్రగిరి సమీపంలోని ముక్కోటి వద్ద నున్న పి ఎల్ ఆర్ కళ్యాణ మండపం వేదికగా గౌడల కార్తీక వనభోజనం మహోత్సవం నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు యార్లపల్లి గోపి గౌడ్ తెలిపారు. తిరుపతి చిత్తూరు అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన గౌడ కుటుంబీకులందరూ ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు తుమ్మల చెంగయ్య గౌడ్, గురు శేఖర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల గోడలు ధ్వంసం

ప్రజాశక్తి -పిచ్చాటూరు : 'నాడు నేడు 'లో మంజూరైన రూ.12 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల గోడలను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉదయం కళాశాలకు విధులు విచ్చేసి గోడలు నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్ల వద్దకు వెళ్లడంతో గోడలు కూలిపోయి ఉండటంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణంలో ఉన్న గోడలు ధ్వంసం సామాజిక మాధ్యమాల్లో రావడంతో వైసిపి మండల కన్వీనర్ కె.వి.చలపతి రాజు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం దురదృష్టకరమైన విషయం అన్నారు. కన్వీనర్ తో మోహన్, త్యాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



తుపాన్ బాధితులకు టోయోటా చేయూత

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చెన్నై, ఆంధ్రప్రదేశ్ తుపాను ప్రభావిత ప్రాంతాల బాధితులకు ప్రముఖ టోయోటా కిర్లోస్కర్ మోటర్ చేయూత నందించింది. చెన్నై, ఆంధ్రప్రదేశ్‌లోని తుఫాను ప్రభావిత ప్రాంతాలు నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు వినియోగదారుల కోసం ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఆ కంపెనీ డీలర్ భాగ స్వాములతో కలిసి ప్రత్యేక అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏర్పాటు చేసింది. అవసరమైన కస్టమర్‌లకు తక్షణ సహాయం అందించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసింది. అదనంగా, టొయోటా సుషో ఇన్సూరెన్స్ బ్రోకర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టిటిఐబిఐ) వరద పరిస్థితులలో తమ వాహన నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్గదర్శకాలను అందిస్తోంది. ఈ సందర్భంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్‌లోని స్ట్రాటజిక్ బిజినెస్ యూనిట్ (సౌత్ జోన్) వైస్ ప్రెసిడెంట్ తకాషి టకామియా మాట్లాడుతూ, "ఈ సవాలు సమయాల్లో, మేము మా కస్టమర్‌లు, వారి కుటుంబాల భద్రత, శ్రేయస్సు కోసం కట్టుబడి ఉన్నాం.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉత్పన్న మయ్యే ప్రతికూల పరిస్థితుల వల్ల మా వినియోగ దారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మేము చర్య లు తీసుకుంటున్నాము. అంకితమైన కస్టమర్ హెల్ప్‌లైన్ సేవలతో పాటు, కార్ రెస్క్యూ కార్యకలాపాలు కూడా అందిస్తాం.. విని యోగదారులకు టొయోటా హెల్ప్‌లైన్ డెస్క్ ద్వారా ఏదైనా సహాయం కోసం సంప్రదించవచ్చని 24 గంటలూ అందు బాటులో ఉంటుందని తెలిపారు. హెల్ప్ లైన్ నెంబర్లు...**చెన్నై:** లాన్సన్ టొయోటా కాల్ సెంటర్ 044-40008000 హర్ష టొయోటా కాల్ సెంటర్ 044-39997999 ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల వారీగా: లక్ష్మి టొయోటా: విజయవాడ o91-7331100587, గుంటూరు 91-7331100725, ఒంగోలు 91-7331100750, హర్ష టొయోటా:నెల్లూరు 91-9704567129, 9704567120, తిరుపతి 91-8008203669, 8008203869 ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: సంఘంలోని ప్రత్యేక ప్రతిభా వంతులను అక్కున చేర్చుకొని ప్రతి ఒక్కరూ ఆదరించాలని, వారిని ప్రోత్సహించి వారిలో మనో స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసం నింపాలని ఎంఈఓలు సత్యనారాయణ, గోపీనాథ్ అన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్స వాన్ని స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ప్రతి భావంతులపట్ల వారి తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భవిత కేంద్రంలో వారికి అందిస్తున్న ఫిజియో థెరిఫీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య తో పాటు శిక్షణను పిల్లలకు అందేలా తల్లిదండ్రులు చూసు కోవాలని కోరారు. వారికి ప్రోత్సాహక బహుమతులుగా ట్యాబ్‌లు అందించారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకటరమణ, సహిత విద్య ఉపాధ్యాయుల పి వెంకటరమణ, ఎం రమణయ్య, పిల్లల తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు బహుమతులు అందిస్తున్న ఎంఇవోలు

బుచ్చినాయుడు కండ్రిగ: ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలందరూ భవిష్యత్తులో మెరుగైన నైపుణ్యం సాధించాలని ఎంఇవోలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భవిత స్కూలులో ప్రత్యేక ప్రతిభా వంతుల దినోత్సవం మండల విద్యాశాఖ అధికారులు కే రవీంద్ర నాథ్, ఏ ముని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇవోలు మాట్లాడు తూ పిల్లలందరూ మంచి భవిష్యత్తుతో ఎదగాలని మెరుగైన నైపుణ్యాలను సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమం లో పిల్లలకు కథలు, పాట లు, ఆటలు నిర్వహించి అత్యధిక మెరుగును కనపరిచిన వారికి బహుమతులు అందించారు. సమగ్ర శిక్ష అభియాన్ పిల్లలకు ఉపకారాలు పంపిణీ చేశారు. ట్రై సైకిల్స్, బధిరులకు ట్యాబ్‌లు పంపిణీ చేశా రు. డిజిటల్ విద్యను అందించడానికి సర్వ శిక్ష అభియాన్ 2025 విజన్ ఆంధ్రా అనే ప్రత్యేక డిజిటల్ విద్య నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు సతీష్, అయ్యప్ప రెడ్డి, పీజీ నయోమి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: మాజీ ఎంపీ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : మిచౌంగ్ తుపాను వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కారణంగా వెంకటగిరి పర్యటనలో భాగంగా 13వ వార్డు మల్లమ్మ టెంపుల్ సవారి గుంటలో నివసిస్తున్న పేద బడుగు వర్గాల వారిని ఆయన బుధవారం ఆప్యాయంగా పలకరించారు. ఈ వర్షాలకు దెబ్బతిన్న గోడలను ఈ వర్షాలకు ఎలా ఉన్నారో తెలుసుకుని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎంపీగా ఉన్న ఈ ప్రాంతంలో వరద బాధితులకు వెంటనే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సహాయం, బియ్యం పంపిణీ చేశామని గుర్తు చేశారు. గత నాలుగు రోజులుగా పడిన వర్షాలకు ఈ ప్రభుత్వం పేదలకు సహాయం అందిచాల్సిన బాధ్యత ఉన్న నా యకులు పరా మర్శించిన దాఖ లా లు కూడా లేవని, పేదలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం విఫల మైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంట శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కలపాటి శ్రీనివాసులు రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ప్రసిడెంట్ ఏ గోపి, కాంగ్రెస్ మండల ప్రసిడెంట్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



కెసిఆర్ ఆరోగ్యం మెరుగుపడాలి: బిఆర్ఎస్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కేసీఆర్ హైదరాబాద్ లోని ఫేమహౌస్ లో ప్రమాదవశాత్తు జారపడ్డారు. వారి ఆరోగ్యం మెరుగుపడాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు డిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. తుంటి విరిగి అనారోగ్య బారిన పడిన సందర్భంగా అయన త్వరగా కోలుకోవాలని తిరుపతి లోని బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి వెంకన్న ను మొక్కుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజులలో బిఆర్ఎస్‌ని భారతదేశంలో అత్యున్నత స్థాయి కి తీసుకుపోతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

లీడ్ ద్వారా పాఠశాలలో ఏ వన్ ఆధారిత అసెస్‌మెంట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: భారతదేశపు అతిపెద్ద స్కూల్ ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ 9,000 పాఠశాలల నెట్‌వర్క్ కోసం ఏ1-ఆధారిత అసెస్‌మెంట్‌లను ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఈఓ, సహ-వ్యవస్థాపకుడు సుమీత్ మెహతా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లీడ్ ఏ1-ఆధారిత మూల్యాంకన కార్యక్రమం, దేశంలోని పాఠశాలలతో 11 సంవత్సరాలకు పైగా పని చేయడం ద్వారా పొందిన అకడమిక్ పరిజ్ఞానంతో రూపొందించబడిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గది అవసరాలకు సరిపోయే మూల్యాంకనాలను అనుకూలీకరించడానికి, నిర్వహించడానికి వీలు కల్పిస్తుందని, రాబోయే ఐదేళ్లలో 26 మిలియన్ల పాఠశాల విద్యార్థులకు ప్రోపల్సివ్ లెర్నింగ్‌ను తీసుకురావడానికి, అంతర్జాతీయంగా బెంచ్‌మార్క్ చేయబడిన బోధనా పద్ధతులతో, సరికొత్త సాంకేతికతతో ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. ఇది పరీక్ష పేపర్ లీక్‌ల ముప్పును కూడా దూరం చేస్తుందన్నారు. ప్రతి బిడ్డకు అద్భుతమైన అభ్యాసాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, సరసమైందిగా చేయాలనే లీడ్ మిషన్‌లో ఇది అంతర్భాగంగా ఉందని తెలిపారు. తరగతి గది అభ్యాస అవసరాలకు సరిపోయేలా అధిక-నాణ్యత ప్రశ్నలను రూపొందించడానికి రూపొందించబడ్డాయి, అదే సమయంలో ఉపాధ్యాయుల సమయాన్ని కూడా ఆదా చేస్తాయని, విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఇది 50,000 కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఇది మొత్తం బోధన-అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా, భవిష్యత్తులో డిజిటల్ సవాళ్లకు ఉపాధ్యాయులను సిద్ధం చేస్తుంది. దీనిని విద్యార్థులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఎస్పీడీసీ అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు మరమ్మతులు, విద్యుత్ పోల్స్ వైర్లు మార్పులు వల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. నగరంలోని బాలాజీ కాలనీ, ప్రకాశం రోడ్డు,ఇందిరానగర్, బలిజ వీధి, వేషాలమ్మ వీధి, గాంధీ రోడ్డు, కర్నాల్ వీధి, డివిఆర్ రోడ్డు, ఎస్ జి కాలనీ, చింతల చేను లీలామహల్ రోడ్ లో విద్యుత్ ఉండదని ఈ ఈ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు.వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

తిరుపతి(మంగళం): విద్యుత్తు సరఫరా నిర్వహణ, మరమ్మతుల కారణంగా చంద్రగిరి మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈలు నాగరాజు, హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంట నష్టం పరిశీలన


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలను శ్రీకాళహస్తి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ రెడ్డి తమ బృందంతో మండల కేంద్రంలో మాల గ్రామ పంచాయతీలో పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి భారతీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన తుపాను దాటికి దెబ్బతిన్న పంట పొలాలకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నష్టపోయిన రైతులు గ్రామ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రం వద్ద అర్జీ, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారి పాస్ బుక్, పాస్ పోర్టు సైజు ఫొటో ఇచ్చి తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. పంట దెబ్బతిన్న రైతులకు 80 శాతం ఎరువులతో పాటు, వరి విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, సర్పంచ్ గోపాల్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు రైతులు పాల్గొన్నారు.

అధికారంలోకొస్తే నియోజకవర్గం అభివృద్ధి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి హామీ ఇచ్చారు. 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె 34వ వార్డు ఏపి పుత్తూరులో పర్యటించారు. వార్డులో ప్రజలకు కనీసం తాగునీరు, డ్రైనేజ్, వీధి దీపాల సౌకర్యం లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని జగన్ ప్రభుత్వం ఉందని, తాము అధికారంలోకి వస్తే పై నుండి పట్టణం వరకు మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రిషితా రెడ్డి

తుపాను బాధితులకు సాయం

ప్రజాశక్తి - తడ: తడ గ్రామ పంచాయతీలోని ఎస్‌టీ కాలనీ లోని తుపాను బాధితులకు తడ మండల తహశీల్దార్ జయ జయ రావు , తడ సర్పంచ్, వైసిపి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ బియ్యం 25 కిలోలు, కందిపప్పు 1 కిలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు యూలయ్య, రమేష్, దేవేంద్ర, శివకుమార్, వెంకట రమణయ్య పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలం మేడుగులపాలెం ఎస్టీ కాలనీ వరద బాధితులకు నిత్యావసర సరుకులు ఎమ్మెల్యే డాక్టర్ బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల ఇన్‌ఛార్జ్ కిషోర్ రెడ్డి, మండల, అధ్యక్షులు రమణయ్య యాదవ్, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య, సోషల్ మీడియా కన్వీనర్ కేశవులు రెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ శ్రీహరి రాయల్ , జి పి యాదవ్ ,వైఎస్ఆర్‌సిపి నాయకులు మేర్లపూడి రాజేంద్రన్ , రోల్ల కిష్టయ్య రమేష్, రంగయ్య, చంటి, వెంకటేష్, జై చంద్ర, పాత వీరాపురం దామోదర్ రెడ్డి అంజిమేడు శివ, నాయకులు 45 ఎస్టీ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

స్విమ్స్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలో ఫిజియాలజి విభాగం పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని మనోహరన్ హరిప్రియకి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టాను ప్రదానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. మనోహరన్ హరిప్రియ మెడికల్ ఫిజియాలజి విభాగం కింద ఫిజియాలజిలో 'ఎఫెక్ట్స్ ఆఫ్ హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ఆన్ ఆక్సిడేటివ్ స్ట్రేస్ మార్కర్స్ ఇన్ పేషంట్స్ విత్ కరోనరీ ఆర్టరి డిసీస్' అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ శర్వాణి పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించినందుకు పిహెచ్‌డి అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు విభాగాధిపతితో పాటూ డైరెక్టర్ డాక్టర్ కార్వి కుమార్, ఇతర సిబ్బంది ఆమెని అభినందించారు.

డ్రైనేజీని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని ఏడవ వార్డు కోళ్ల ఫారం కాలువలను శుక్రవారం కమిషనర్ వెంకటరామయ్య పరిశీలించారు. ఆ వార్డ్ కౌన్సిలర్ చంద్ర శేఖర్ రెడ్డి అక్కడ ప్రజలు డ్రైవ్ కాలువ లోని మురికి నీరు ఎటూ వెళ్లక దోమలకు నిలయంగా మారిందని కమిషనర్ కు ఫిర్యాదు చేయడంతో వారి సిబ్బందితో వెళ్లి పరిశీలించి త్వరగా డ్రైనేజీ పనులను నీళ్ల నిలవకుండా వెళ్లే విధంగా చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుని ఆదేశించారు. కాలువపై వున్న బండలను ఓపెన్ చేసి అడ్డు లేకుండా తీసివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాల్గొన్నారు.

రక్త దానం మరొకరికి ప్రాణ దానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మనం ఇచ్చే రక్త దానం మరొకరి ప్రాణాలు నిలపెడుతుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. హెచ్డిఎఫ్సి బ్యాంక్, పరివర్తన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోలా ఆనంద్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మేనేజర్ హేమ శేఖర్, ఆపరేషన్ మేనేజర్ బాలచంద్ర పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మిచౌంగ్ తుపాను ప్రభావంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నష్టపోయిన ప్రతి బాధితుడికీ జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి భరోసా ఇచ్చారు. తుపానుకు దెబ్బతిన్న చెంచులక్ష్మి కాలనీలో శుక్రవారం ఆమె బాధితులకు ప్రభుత్వం తరపున సాయం అందించారు. కుటుంబంలో ఒక్కరు ఉంటే రూ.వెయ్యి, ఇద్దరు ఉంటే రూ.2వేలు, అంతకు పైబడి ఉంటే రూ.2500 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు ఇంటి సరుకులు పంపిణీ చేశారు. తుపాను బాధితులకు ఇలాంటి సాయం కావాలన్నా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముందుంటారన్న సంగతి మర్చిపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, వైసీపీ నాయకులు గోరా, ఫరీద్, బాబు, చిన్నా, ముని లక్ష్మి, రఘు నాయుడు పాల్గొన్నారు.